క్లుప్తంగా

ప్రాణ వాయువు అందించేవి చెట్లు

ఈర్లపల్లి సర్పంచ్ ముత్తంగి రాజశేఖర్


పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజశేఖర్

చేవెళ్ల: మానవ జీవితంలో చెట్లకు ప్రత్యేక స్థానమని, అవి లేకపోతే మానవ మనుగడ లేదని ఈర్లపల్లి సర్పంచ్ ముత్తంగి రాజశేఖర్ అన్నారు. ఈర్లపల్లి గ్రామంలో శుక్రవారం బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఇంటికి నాలుగు రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్ల వెంట మొక్కలు నాటారు. అనంతరం సర్పంచ్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రాణవాయువును అందించేవి చెట్లు కాబట్టి ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, బాలవికాస్ సంస్థ ప్రతినిధి విక్రమ్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు పదోన్నతి


అభినందిస్తున్న సీఐ సైదులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్

చేవెళ్ల: చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురికి పదోన్నతి లభించింది. ఉద్యోగం ఎక్కడ చేసినా బాధ్యతయుతంగా పనిచేసి అందరి మన్ననలు పొందాలని సీఐ సైదులు పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వారికి సీఐ సైదులు అభినందించారు. ఎ. బాల్‌రాజ్, పి. మల్లేశ్, సీహెచ్ శ్రీనివాస్, డి. శ్రీశైలంలు పదోన్నతి పొందారు. వారిని ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్‌లు అభినందించారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం


కరపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు యూత్ కాంగ్రెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీ ప్రభుత్వాలు మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్, మోదీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాణయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మేడిపల్లి సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, జంగారెడ్డి, శంకర్, మినాజుద్దీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే ధ్యేయం


ఆరోగ్యరథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చేవెళ్ల: మెరుగైన వైద్య సేవలు అందించటమే ధ్యేయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. కమ్మెట గ్రామంలో శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆరోగ్యరథం వైద్యసేవలను ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఈ ఆరోగ్యరథం సేవలు అందిస్తోందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే ఎదైనా సాధించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసీ రాజు, ఎంపీపీ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, రాజు, మాదవ్‌గౌడ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం

- పర్యావరణ పరిరక్షణే లక్ష్యం
- పన్నెండేళ్లుగా వినాయకప్రతిమల తయారీ
- ప్లాస్టర్‌ఆఫ్ ప్యారీస్‌కు దీటుగా విగ్రహాల అమ్మకాలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రతిమలు

షాద్‌నగర్‌రూరల్: మట్టి గణపతిని పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుకుందాం..గత పన్నెండేళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తూ పర్యావరణ హితమే తమ అభిమతమని వారు చాటుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలకు దీటుగా మట్టి వినాయక విగ్రహాలను అందరికి నచ్చే విధంగా తయారు చేస్తున్నారు. పట్టణంలోని ఆనంద్‌నగర్ కాలనీ చెందిన ఓ యువకుడు మట్టి విగ్రహాల తయారీతో అందరిని ఆకట్టుకుంటున్నాడు.

పన్నెండేళ్లుగా మట్టి గణపతి ప్రతిమల తయారీ

నందిగామ మండలం శ్రీనివాసులగూడ గ్రామానికి చెందిన మల్లేశ్ పట్టణంలోని ఆనంద్‌నగర్ కాలనీలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. మట్టి విగ్రహాలకు ప్రారంభంలో అంత ఆదరణ లేదు. అయినప్పటికీ ఆ యువకుడు నిరుత్సాహ పడకుండా పర్యావరణ హితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. పన్నెండేళ్లుగా మట్టి వినాయక ప్రతిమలను తయారుచేస్తున్నాడు.

ఆరు ఇంచుల నుంచి ఆరు అడుగుల వరకు..

వినాయక చవితి పర్విదినాన్ని పురస్కరించుకొని ఆరు నెలల ముందునుంచే మట్టి వినాయక విగ్రహాల తయారీని ప్రారంభిస్తారు. ఆరు ఇంచుల విగ్రహం నుంచి ఆరు అడుగుల వరకు తయారు చేస్తారు. మటి విగ్రహాలకు మంచి ఆదరణ లభిస్తుంది. విగ్రహాల పరిమాణాన్ని బట్టి విక్రయిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలు పట్టణంలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. విగ్రహాల తయారీతో వచ్చే ఆదాయంతోనే వారు జీవనాన్ని సాగిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణగా..

పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ఆ యువకుడు నడుంబిగించాడు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. జనంతో పాటు జీవరాసులకు ముప్పు ఏర్పడనుంది. వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మట్టి విగ్రహాలే మేలని పలువురు పేర్కొంటున్నారు.


మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న యువకులు

పెరుగుతున్న ఆధరణ

మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. రసాయనాలతో తయారు చేసిన విగ్రహలకన్నా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు జనం మొగ్గు చూపుతున్నారు. మట్టి విగ్రహాలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

మట్టి ప్రతిమలకు డిమాండ్.



పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పన్నెండేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాం. మట్టి వినాయక విగ్రహాలకు మంచి ఆదరణ లభిస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసే విగ్రహాలతో పోల్చుకుంటే మట్టిలో చేసిన ప్రతిమలకు భలే డిమాండ్ ఉంది.

– మల్లేశ్, మట్టి విగ్రహాల తయారీ దారుడు, షాద్‌నగర్

జీవనోపాధి పొందుతున్నాం..



మట్టి వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. మట్టి విగ్రహాల తయారీతో జీవనోపాధిని పొందుతున్నాం. స్వచ్ఛంద సంస్థలవారు వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు కావాల్సిన విగ్రహాలను తయారు చేయడానికి ఆర్డర్‌లు ఇస్తున్నారు.

– ఇందిరమ్మ, మట్టి విగ్రహాల తయారీదారు, షాద్‌నగర్

'పాలమూరు రంగారెడ్డి'తో సాగునీరు

బీఆర్ఎస్ సీనియర్ నేత సత్యనారాయణ

కొత్తూరు: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండల అధ్యక్షుడు మెండె కృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రాజెక్టును పూర్తి చేయడం సంతోషకరమన్నారు. ఈ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభించిన తర్వాత ప్రతీ గ్రామంలో ప్రజలు, రైతులు సంబరాలు చేసుకోవాలని వారు కోరారు. గత ప్రభుత్వాల అసమర్ధతతో జిల్లాల్లో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. జిల్లా గుండా వందల కిలోమీటర్ల మేర కృష్ణానది ప్రవహించినా తాగు, సాగు నీటి కోసం ప్రజలు పడిన కష్టాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చనుందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినప్పటికీ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, పద్మారావు, సత్తయ్య, లక్ష్మణ్‌నాయక్, దిలిప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

పేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: పేదల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ సూపర్ వైజర్లకు ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ కార్యక్రమం చేపట్టిందన్నారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దీర్ఘ కాలిక వ్యాధులపై అవగాహన కల్పించి చికిత్సలు అందజేయాలని సూచించారు. గ్రామాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా రక్తం ఎక్కించాలన్నారు. ఈ కార్యక్రమంపై అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆయుష్మాన్ భవ కార్డును ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని, ఈ కార్డులతో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్సలు చేయించుకోవచ్చన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవ పక్వాడా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

గణపతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- మండపాల ఏర్పాటులో నిర్వాహకులు
- డీజేలకు అనుమతి లేదు
- శాంతియుతంగా జరుపుకోవాలి
- సీఐ యాదయ్యగౌడ్


యాదయ్యగౌడ్, సీఐ

షాబాద్: వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు షాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి పండుగ సందర్భంగా మండల పరిధిలోని దేవాలయాలతో పాటు పలు చోట్ల మండపాలు ఏర్పాట్లు చేసి గణపతి విగ్రహాలను పెట్టేందుకు నిర్వాహకులు, యువజన సంఘాల వారు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల నుంచి నిర్వాహకులు మండపాల ఏర్పాట్లతో పాటు వినాయక విగ్రహాల కొనుగోలులో నిమగ్నమయ్యారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రతీ గ్రామంలోను 2 నుంచి 5 వరకు విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెద్దలు, యువకులు, చిన్నారులు వినాయక విగ్రహాలను పెట్టేందుకు మండపాలను తయారు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఉత్సవాలు ఏర్పాటుపై పోలీసులు మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వినాయక మండపాల్లో విగ్రహాలను పెట్టిన నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యేంత వరకు పాటించవలసిన సూచనలు, తీసుకోవలసిన జాగ్రతల గురించి వారు వివరించారు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరు సహకరించి వినాయక విగ్రహాల ప్రతిష్ఠించే నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యేంత వరకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే చోట్ల విగ్రహాలను పెట్టొదన్నారు. పోలీసులు సూచించిన నియమ, నిబంధనలు నిర్వాహకులు తప్పకుండా పాటించాలన్నారు. మండపాల్లో ప్రతీ రోజు పూజలతోపాటు రాత్రి ఇచ్చిన సమయం వరకు మాత్రమే భజన చేసుకోవాలని పోలీస్ అధికారులు తెలిపారు. డిజేలకు అనుమతి లేదు. ఒకటి లేదా రెండు సౌండ్ బాక్స్‌లు మాత్రమే నిమజ్జనోత్సవ ఊరేగింపులో పెట్టుకోవాలి. వాహనాల డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలి. నిమజ్జనం రోజున వాహనాలకు కేటాయించిన నంబర్ల ప్రకారం వరుస క్రమంలో తరలించి అధికారులకు సహకరించాలి. నిబంధనలు ఉల్లంగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.


షాబాద్‌లో ఏర్పాటు చేసుకున్న వినాయక మండపం

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ నక్షత్రం

మొయినాబాద్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మొయినాబాద్ ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో రూ.20లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ గునుగుర్తి స్వరూపతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఉపసర్పంచ్ సుధాకర్ రెడ్డి, వార్డు సభ్యులు సుజాత, పద్మ, యాదమ్మ, సరిత, శ్రీనివాస్, దావీదు, నాగేంద్రస్వామి, సబిత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ ప్రేమ్‌కుమార్ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ. 25 లక్షలతో సిమెంట్‌రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. బంగారు రాములు, హైమద్, బుచ్చయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వం

- అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు చేపడుతున్న సమ్మె శుక్రవారానికి ఐదో రోజుకు చేరింది. సమ్మె శిబిరానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, మమత, జయ, పద్మ, పుష్ప, తులసీ, నిర్మల, భారతి, చంద్రకళ, మల్లేశ్వరీ, శారద, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె కొనసాగిస్తున్నారు. మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. జయమ్మ, సుమల్య, శశికళ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో సమ్మె నిర్వహిస్తున్నారు. యామిని, శారద, వినోద, అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న రాజు, అంగన్‌వాడీ టీచర్లు

అనారోగ్యంతో షాబాద్ ఉపసర్పంచ్ మృతి

షాబాద్: గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ షాబాద్ ఉపసర్పంచ్ తగరం నర్సింహులు (35) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అతను మృతి చెందాడు. అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


నందిగామ: దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

నందిగామ: ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలలో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కొంగర లక్ష్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నెరవేరుస్తామని బీజేపీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ మాదిగ, శ్రీను, అంజయ్య, రాంచెంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొందుర్గులో నిర్వహించిన నిరసన దీక్షకు షాద్‌నగర్ ఇన్‌చార్జి చిన్నోళ్ల అనంతయ్య హాజరై మాట్లాడారు. మండల ఇన్‌చార్జి వినోద్, ఆనంద్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి' పేరుతో మోసం

పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్ మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్‌ను వెంటనే నిర్మించాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం వీర్లపల్లిశంకర్ పట్టణ ముఖ్యకూడలిలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. ప్రాజెక్టు పేరుతో ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల రైతులను మోసంచేసి ఓట్లు వేయించుకున్నట్లే మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయకుండానే నార్లాపూర్‌వద్ద ప్రారంభోత్సవం చేస్తామని చెప్పడం దేనికి నిదర్శనమని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్‌గౌడ్, చల్లాశ్రీకాంత్ రెడ్డి, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, రఘు, సింగారంసుదర్శన్, పురుషోత్తంరెడ్డి, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

లక్ష్మిదేవిపల్లిపై తప్పుడు ప్రచారాలు

పాలమూరు-రంగారెడ్డి పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెబుతున్న పాలకులు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. కనీసం భూ సేకరణ చేపట్టలేదని వారు మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా ప్రారంభించనున్న నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరవెన, ఉదండాపూర్ రిజర్వాయర్‌ల పనులు పూర్తి కాలేదన్నారు. నార్లాపూర్ ప్రారంభోత్సవంతో ఒక్క ఎకరాకు కూడా నీరు రాదన్నారు. అందెబాబయ్య, కక్కునూరివెంకటేశ్‌గుప్తా, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.


సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వీర్లపల్లిశంకర్

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం


బీజేపీలో చేరిన యువకులు

షాద్‌నగర్: అభివృద్ధి సంక్షేమానికి ఆకర్షితులై బీజేపీలోకి చేరుతున్నారని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పుల్చర్లకుంట తండాకు చెందిన సుమారు 50 మంది యువకులు శుక్రవారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసుగు చెందారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. పార్టీలో చేరిన వారిలో నరేశ్ నాయక్, డాక్టర్ బాలు, గిరి, మురళీ, వినోద్, ప్రకాశ్, శ్రీను, వీరేశ్, హర్యా, రాజు, బాబు, గోప్యా నాయక్, సురేశ్, మహేశ్, వెంకటేశ్, లింగం, మహేందర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల ప్రదీప్, శ్యాంసుందర్, వెంకటేశ్, విష్ణువర్ధన్‌గౌడ్, నరేశ్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం


అవార్డు తీసుకుంటున్న సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యావతి

కేశంపేట: స్వచ్ఛభారత్ మిషన్ 2023లో భాగంగా మండలంలోని కేశంపేట గ్రామ పంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. శుక్రవారం కలెక్టరేట్‌లో సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యావతిలకు జిల్లా అదనపు కలెక్టర్ భూపతిరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితరెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లగనమోని రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏపీఓ అజీజ్ పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీ 'చిలుకూరు'

మొయినాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుల్లో చిలుకూరు గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు దక్కింది. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి చేతులమీదుగా చిలుకూరు సర్పంచ్ స్వరూప అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీడీఓ సంధ్య, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్: అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గునుగుర్తి స్వరూప